
# గద్దలు




-పెద్దింటి అశోకకుమార్

**'ఈ రోజు కూడా నీళ్లు రావు. ఈ పొలాలు పండవు!' చెరువు కొమ్మ మీది చింతచెట్టు కమ్మ మీద కూర్చున్న చిలక వాడిపోయిన పైరు వైపు చూస్తూ అన్నది.**

'అదేంటీ... తప్పుడు జోస్యం చెబుతున్నావు. రాత్రి పొద్దుపోయే వరకు మున్నూరు కాపు సంఘం గోడ మీదే కూర్చున్నాను. తెల్లవారేలోపు చెరువులోకి నీళ్లు వస్తాయని చెప్పారు. డబ్బు కూడా వసూలు చేశారట తెలుసా?' పక్కనే కూర్చున్న గోరింక అన్నది.

'అసలు సంగతి అక్కడే ఉంది. ఊళ్ళో ఎకరానికి ఇంత అని డబ్బు వసూలు చేశారని ఇంజనీర్‌కు తెలిసిందట. నీటిచుక్కను కూడా ప్రాజెక్టులోంచి విడిచేది లేదని మొండికేసుకుని కూర్చున్నాడట!'

'పాపం. సత్తెకాలపు మనిషిలా ఉన్నాడు. డబ్బు ఎందుకు వసూలు చేశారని కోపగించుకున్నాడా ఏంటి?'

'కోపగించుకున్న మాట నిజమే! కానీ అందుకు కాదు. తన వంతు వాటా ఎందుకు ఇవ్వలేదా అని!'

'ఓరి దరిద్రుడా! అష్టకష్టాలు పడి అప్పులు చేసి వరి నాట్లు వేసిన రైతులు కెనాల్‌లోకి నీళ్లు ఎప్పుడొస్తాయా అని కన్నీళ్లతో ఎదురుచూస్తుంటే వాటా రాలేదని కాలయాపన చేస్తాడా. మరి వసూలు చేసిన డబ్బులోంచి వాడి వాటా వాడి మొహాన ఎందుకు కొట్టలేదు?'

'ఎలా కొడతారు. సూపర్‌వైజర్ కొడుకు ఇంటర్ తప్పాడు కదా!'

'వాడు ఇంటర్ తప్పడానికి ఇంజనీర్ వాటాకి సంబంధం ఏంటి?' అడిగింది గోరింక.

'నీకు బొత్తిగా తెలివిలేదు. ఇంటర్ తప్పాడని కొడుకును చెడామడా తిట్టాడు సూపర్‌వైజర్. వాడు చేతికందిన డబ్బును పట్టుకుని పారిపోక ఏం చేస్తాడు!'

'ఆ డబ్బును రైతుల వద్ద వసూలు చేయాలనుకున్నాడా?'

'వసూలు చేయాలనుకోవడం కాదు. వసూలు చేసిన డబ్బే! అందరికీ వాటాలు పంచుతానని తీసుకున్నాడట. మరునాడు ఇలా జరిగింది. నేనేం చేసేదని చేతులెత్తేశాడు. రైతులు ఏం చేస్తారు పాపం!'

'చేసేదేముంది. అందరూ వెళ్లి సూపర్‌వైజర్ ఇంటి ముందు కూర్చోవాలి. పేపర్ కెక్కాలి. దిగి రాక ఏం చేస్తాడు?'

'అక్కడ కూర్చోవడం కాదు. ఇక్కడ తన ఇంటి ముందు కూర్చుంటారని విషయం ఎవరికీ తెలియనీయడంలేదు. రేపు మాపని వాయిదా వేస్తూ చేతులు పిసుక్కుంటున్నారు. నీళ్ళ కొరకు తిరిగే పెద్దమనుషులు. పొద్దునంటూ వెళ్లి రాత్రి దాకా తిరిగి వస్తున్నారు. అయినా వాళ్లేం చేస్తారు పాపం! చేసేదంతా చేశారు. ఏం లాభం?'

'చేసేదంతా చేసింది ఎవరో కాదు. రైతులే! చెరువులో నీళ్లు లేవు వద్దు వద్దనంగ ఒకరిని చూసుకుంటూ ఒకరు వరినాట్లు వేసిరి. ఆరుతడి పంటలు వేసుకొమ్మని పెద్దమనుషులు చెబితే ఎవరూ వినకపోయిరి. లంచమడిగిన వారిని చెప్పుతో కొట్టాలని వీళ్లకు ఎవరూ చెప్పడం లేదా...?'

'చెప్పుతో కాదు కానీ... చెంప మీద కొట్టాడనే సలహా చెప్పక తప్పించుకుని తిరగమన్నాడట లింగారావు. వారం రోజులాగితే రైతులు మరచిపోతారని తప్పును ఎవరి మీదికో నెట్టి చేతులు దులుపుకొమ్మని చెప్పాడట!'

'చెంప మీద కొడితే మాత్రం చెత్త సలహా ఇస్తాడా...?'

'ఇవ్వకేం చేస్తాడు. నువ్వు మరీ అమాయకంగా మాట్లాడుతున్నావు. కాశయ్య పొలం కాలువ కిందనే కదా ఉన్నది. అందుకే అలా చెప్పాడు!'

'ఏం...?' రెప్పల్ని టపటప లాడిస్తూ దగ్గరగా జరుగుతూ అడిగింది గోరింక.

ఒక రెప్పను ఎత్తి గోరింకను అక్కున జేర్చుకుని ముక్కుతో మెడమీద పొడుస్తూ అన్నది చిలుక.

'అది అంతే! చెర్లోకి నీళ్లు రాకముందే కాలువలోంచి కాశయ్య పొలంలోకి పోతాయి. ఐదెకరాల పొలమాయె. మంచి బిర్రుమీదుంది. నీళ్లు పారాలే గాని ఇరువైపుట్ల పంట!'

'అయితే ఏం...?' మరింత దగ్గరగా జరిగింది గోరింక.

'చెంప దెబ్బ కొట్టింది శంకరి కదా! శంకరి, కాశయ్య పొలాన్ని పొత్తులో చేశారు కదా! పంట పండితే వాళ్లు బాగుపడతారు కదా! లింగారావుకు కోపంగా ఉండదా మరి?'

'ఓరి దరిద్రుడా! చెడిపోయే సలహాలివ్వడం ఎంతవరకు సమంజసం. అలాంటి వారు ఎప్పుడో ఏడుస్తారు. వెంకటి చూడు! ఎంత ఏడుస్తున్నాడో ఇప్పుడు. అతడు ఏడుస్తుంటే నాకే ఏడుపు వచ్చిందనుకో! అంతగా ఎందుకేడుస్తున్నాడంటావు?'

'ఏడవక ఏం చేస్తాడు! అప్పు తెచ్చి ఐదెకరాల పొలం ఊరికి ముందే నాటు పెట్టాడు కదా!'

'అయ్యో! పొలం ఎండిపోయిందని ఏడుస్తున్నాడా...?'

'ఎండిపోయింది నిజమే! ఏడుస్తున్నది మాత్రం అందుక్కాదు. చెరువులోకి నీళ్లు వస్తున్నాయని అందరూ అంటుంటేనూ!'

'నీళ్లు వస్తే సంతోషించాలి కానీ ఏడ్వడమెందుకు?'

'పూర్తిగా ఎండిపోయిన తన పొలం ఎలాగూ పండదు. పక్కపొలాలు పండడమెందుకని?'

'ఓరి దరిద్రుడా... తాటిచెట్టును ఒకడు తంతే వాడి తలను తన్నేవాడు ఇంకొకడు. వీళ్లు బాగుపడరు. అందరూ ఒక్క తాటిమీద నడిస్తే ఏ పనైనా చేయవచ్చు. కాదంటావా?' తన ముక్కుతో చిలుక మెడను ప్రేమగా నిమురుతూ అడిగింది గోరింక.

పొద్దు పొడుస్తుంది. సూర్యుని చుట్టూ నల్లమబ్బులు. ఆకాశం బద్ధకంగా వొళ్లు విరిస్తే చీకటి కురుల్లోంచి రాలి పడ్డ పువ్వుల చుక్కలు.

'ఎందుకు కాదంటాను! ఒక్కటి మాత్రం నిజం. ఒక్క తాటి మీద నడవాలని చెప్పిన నాంపెల్లి పని మాత్రం అయిందంటాను. చెడు వ్యాపించినంత తొందరగా మంచి వ్యాపించదంటాను'

'అదేంటి? నాంపెల్లికి ఏం జరిగింది?'

'జరుగుతుంది. ఊరందరూ నాంపెల్లిపై దాడి చేస్తారు. నీళ్లు ఎందుకు రావడంలేదని నిలదీస్తారు. పెద్దమనుషులా...? మజాకా...!'

చెట్టు కొమ్మ గాలికి ఊగింది. భయంగా ఇటూ అటూ చూసి గోళ్లతో కొమ్మను గట్టిగా పట్టుకుని అడిగింది గోరింక.

'నేను అమాయకురాలినని మరీ అబద్ధాలు నూరిపోస్తున్నావు. ప్రాజెక్టులోంచి చెరువులోకి నీళ్లు తెస్తానని డబ్బు తీసుకున్న వారికి నాంపెల్లికి ఏం సంబంధమూ లేదు. మరి ఎందుకు దాడి చేస్తారంటావు?' ఆసక్తిగా.

'ఏ సంబంధమూ లేదు కాబట్టే! ఆరునెలల క్రితం ఊరిలో ఏం జరిగిందో గుర్తుంది కదా!' అడుగుతూ మరో కొమ్మపైకి ఎగిరింది చిలుక. చెప్పాపెట్టకుండా ఎగరడంతో కొమ్మ కదిలి సొలిగిపడబోతూ రెప్పల్ని టపటప లాడించింది గోరింక. టగిరి దాని పక్కన చేరింది.

'గుర్తులేకేం. ఊరిలో ఫైనాన్స్ ఓపెన్ చేద్దామనుకుంటే అడ్డుకున్నాడు నాంపెల్లి. ఇంతకు ముందైై ఊరిలో రెండు రూపాయల వడ్డీ చొప్పున అప్పు పుట్టేది. నాలుగు రోజులు ఎనకా ముందు జరిగినా అప్పు అడిగేవారు కాదు. డబ్బు కట్టేప్పుడు ఐదు పది రూపాయలు విడిచి పెట్టేవారు. ఫైనాన్స్ తెరిస్తే మిత్తి పెరుగుతుంది. కాగితాలని ఖర్చని తడిసి ఓపెడవుతుంది. మిత్తికి మిత్తిని వసూలు చేస్తారు. అలా అడ్డుకోవడం మంచి పనే కదా...?'

'మంచి పని కాబట్టే మనసులో పెట్టుకున్నారు. ఎవరి మీదనో తోసెయ్యాలి కాబట్టే నాంపల్లిని చూపిస్తున్నారు. రాజకీయమంటే ఏంటనుకున్నావు!'

'ఇది మరీ అన్యాయం. చేసేదంతా చేసి అమాయకులను బలిచేస్తే ఎలా...? అయినా రైతులేం గుడ్డివారు కాదు. ఏది అబద్ధం. ఏది నిజం తెలుసుకోకుండా చెప్పుడు మాటల్ని నమ్ముతారేంటి?'

'నమ్మక ఏం చేస్తారు? ఛస్తారా? చచ్చినట్టు నమ్మి ఊరుకుంటారు. నమ్మనివాడు ఎవడైనా ఉంటే నమ్మినట్టు నటిస్తారు. నోరు విప్పరు. ఎందుకంటే ఊళ్లో బస్సు తిరగడం లేదు కదా!'

'బస్సుకు నమ్మకానికి సంబంధం ఏమిటి?'

'చాలా ఉంది. ఊరి మధ్యలోంచి రోడ్డును తీస్తామంటే నాంపల్లి అడ్డుకుని ఇండ్ల మధ్యలో నలభై ఫీట్ల రోడ్డు ఎందుకు వ్యతిరేకించాడు గదా! సగం ఊరు అతడి మీద కోపంగా ఉంది. ఊరిలోకి వచ్చే అభివృద్ధి పనుల్ని అడ్డుకుంటున్నాడని అప్పుడే ప్రచారం మొదలుపెట్టారు. నీళ్ళు విడిస్తే అక్రమంగా తూములు ఎత్తేశావని పేపరుకు ఎక్కిస్తానని ఇంజనీర్‌కు బెదిరించాడని ప్రచారం మొదలుపెడతారు. గొర్లమంద లాంటి ప్రజలు తలూపక ఏం చేస్తారు. వత్తాసు పలకడానికి సూపర్‌వైజర్ కూడా ఉన్నాడు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు రాలుతాయి కూడా!'

'రెండు పిట్టలా? ఎవరు వాళ్లు...?' రెక్కల్ని టపటప కొడుతూ అడిగింది గోరింక. దానికి ఎదురుగా తిరిగి కోపంగా చూస్తూ 'నీకు అన్నీ చెప్పాలి. ఏదీ గుర్తుండదు. ఏ అమెరికా నుంచో సింగపూర్ నుంచో వచ్చినట్టు మాట్లాడుతున్నావు. నా ముందు మరీ కులుకులు పోతున్నావు!' అన్నది.

గోరింక చిన్నగా నవ్వింది. తమకంగా చిలుకవైపు చూసింది. చిలుక కూడా చిన్నగా నవ్వింది.

'సింగపూర్ అంటే గుర్తొచ్చింది. సైదిరెడ్డిని కదూ నువ్వంటున్నది. ఎవరినీ నొచ్చి నోట మాటనలేదు. ఏదో కాయకష్టం చేసుకుని బాగుపడ్డాడు. ఎవరి తెరువు పోకుండా వ్యవసాయం చేసుకుంటున్నాడు. అతడిని ఏం చేస్తారు?'

'ఏం చేస్తారా? ఇల్లు వాకిలి అమ్ముకునేట్టు చేస్తారు.

'నీళ్లు పాచిక వేసి కూర్చుంటే కాగల కార్యాలన్నీ గంధర్వులే చేస్తారంటావు. చిత్తశుద్ధితో నీళ్లు తెచ్చి రైతులను ఆదుకునే నాయకుడు ఎవరూ లేరంటావు! ఊరు ఊరూ వల్లకాడై పోతుంటే ఎవరికీ పట్టదంటావు. ఇంతకీ నీళ్లు ఎప్పుడొస్తాయంటావు? అసలు వస్తాయా రావా?'

'రాకేం...? తప్పకుండా వస్తాయి. ప్రజల కన్నీళ్లు రావడం ఆగిపోయాక... పొలాలన్నీ ఎండిపోయాక' చెప్పింది చిలక.

కేసులనీ కోర్టులనీ ఊర్ల వెంట తిప్పుతారు. చిప్పచేతికి వచ్చే గతికి తెస్తారు. పలుకుబడితో ఉన్నాడు కదా! ఎందుకు ఓరుస్తారు!'

'ఎందుకు?' గోరింక అడిగింది.

'ఫైనాన్స్ పెద్దలే రోడ్డు కాంట్రాక్టర్లు. వాళ్లే నీళ్ల పెద్ద మనుషులు. అందులో ఇద్దరు సైదిరెడ్డి పాలివాళ్లు. సైదిరెడ్డి పెద్ద పెట్టుబడితో చెరువు కింద పదెకరాల పొలం నాటువేశాడు. అంతా బిర్రుపొట్టల మీదుంది కదా! అందుకని!'

'అది తప్పు! అలా జరక్కూడదు. జరగదు కూడా?'

'తప్పే మరి! ముందుగా సైదిరెడ్డి నాంపల్లిని కొట్టడం తప్పు కాదా...? సైదిరెడ్డికి తాగించి ఉసిగొల్పడం మరీ తప్పుకాదా! చెప్పినంత మాత్రాన్నే నా పొలాన్ని ఎండబెట్టింది నువ్వేరా అని నాంపల్లి మీదికి ఉరికితే ఎవడ్రా అన్నది అని ఇద్దరూ కుస్తీ పట్టి తన్నుకోవడం... తలలు పగలడం ఊరు రెండు వర్గాలుగా విడిపోవడం తప్పు కాదా...! ఇంత జరిగాక ఇద్దరూ పెద్ద మనుషుల వద్దకే తీర్పుకు వెళ్లడం... చెప్పినట్టే చెప్పి పోలీసులకు అప్పజెప్పడం అంతా తప్పే! అయినా ఒక దెబ్బకు రెండు పిట్టలు. అదే పెద్దమనుషుల ఎత్తు. కొట్లాట వల్ల మరో లాభం కూడా ఉంది. నీళ్ల సమస్య మరుగున పడిపోయి కొత్త సమస్య మొదలవుతుంది. పెద్దమనుషులకు చేతి నిండా పని కదా! జరిగేది ఇదే! నా మాటలకు తిరుగు లేదు!'

'తిరుగులేని జోస్యం చెప్పడం నీకు అలవాటే కదా...?' మెడ తిప్పి చుట్టూ చూస్తూ అడిగింది గోరింక. '... ఇలా చేస్తే వీరికి ఏమి లాభం?'

'లాభం నష్టం పక్కకుపెట్టు. ఎలక్షన్లు వస్తున్నాయిగా! అందుకని!'

'ఎలక్షన్లు వస్తే ఏంటి?'

'నాంపెల్లి పాత సర్పంచ్ మనిషి. పాత సర్పంచ్ ప్రజల మనిషి. అతడు గెలుస్తాడని నమ్మకం కుదిరాక బురద చల్లకపోతే ఎలా...? అందుకని!'

'నీళ్లు పాచిక వేసి కూర్చుంటే కాగల కార్యాలన్నీ గంధర్వులే చేస్తారంటావు. చిత్తశుద్ధితో నీళ్లు తెచ్చి రైతులను ఆదుకునే నాయకుడు ఎవరూ లేరంటావు! ఊరు ఊరూ వల్లకాడై పోతుంటే ఎవరికీ పట్టదంటావు. ఇంతకీ నీళ్లు ఎప్పుడొస్తాయంటావు? అసలు వస్తాయా రావా?'

'రాకేం...? తప్పకుండా వస్తాయి. ప్రజల కన్నీళ్లు రావడం ఆగిపోయాక... పొలాలన్నీ ఎండిపోయాక' చెప్పింది చిలక.

'అప్పుడు రావడమేంటి?'

'అధికారులు అప్పటిగ్గాని కళ్లు తెరువరు కదా! అది వారికి అలవాటేనాయె. నీళ్లు విడిచామని ఎమ్మెల్యే కో ఎం.పీకో సంజాయిషీ ఇచ్చి చేతులు దులుపుకుంటారు.'

ఎండ చురుక్కుమనడంతో చుట్టూ చూసింది చిలక. దూరంగా పీతిరిగద్దలు, కూలబడిపోయిన బక్క ఎద్దును పీక్కుతినటానికి ఆకాశంలో గిరికీలు కొడుతూ చుట్టూ చూస్తున్నాయి.

భయం భయంగా చిలకా గోరింకలు చెట్లకొమ్మల చాటుకి ఒదిగాయి.

★

